JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి | సోమవారం 01-12-2025
Medchal - Malkajgiri | Monday 01-12-2025
jayabherinews
సంపుటి : 02 | సంచిక : 185 | పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 185 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com





# తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్

**ప్రభుత్వం గతాన్ని ఒక అనుభవంగా, ఆ అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాలతో భవిష్యత్తుకు స్పష్టమైన ప్రణాళికలను రచించుకుని అద్భుతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న ఆలోచనతో రూపొందించిన తెలంగాణ రైజింగ్-2047 దార్శనిక పత్రాన్ని త్వరలోనే జాతికి అంకితం చేయబోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు.**

- మారుమూల తండా నుంచి హైదరాబాద్ వరకు సమగ్రాభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యం
- మా పోటీ అభివృద్ధి చెందిన దేశాలే.. వారినే ఆదర్శంగా తీసుకున్నాం
- ఈ సంకల్పానికి మా ప్రభుత్వానికి అందరి సహకారం కావాలి

జయభేరి, హైదరాబాద్ :

ప్రజా ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న తరుణంలో భవిష్యత్తులో రాష్ట్రాన్ని బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టడానికి, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసుకోవడానికి తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పన జరిగిందని వివరించారు. తెలంగాణను ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబెట్టడానికి విజన్‌తో పాటు దాన్ని అమలు చేసే వ్యూహంతో ముందుకు వెళుతున్నామని స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, ఇతర మంత్రివర్గ సహచరులు, సలహాదారులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. "రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే స్పష్టమైన పాలసీ ఉండాలి. ప్రపంచ స్థాయి పేరెన్నికగన్న దిగ్గజాలు, పారిశ్రామిక వేత్తలు,

...మిగతాది 2 లో

## డాక్యుమెంట్ సంపూర్ణంగా సిద్ధం

- ఉమ్మడి జిల్లాల్లో ఒకరోజు ఉత్సవాలు
- ప్రపంచ చిత్రపటంలో ఉన్నతస్థానం

**రానున్న మరో రెండు దశాబ్దాల కాలంలో తెలంగాణను ప్రపంచ చిత్రపటంలో ఉన్నతస్థానంలో నిలబెట్టాలన్న సంకల్పంతో భవిష్యత్తు ప్రణాళికలకు సంబంధించి రూపొందించే తెలంగాణ రైజింగ్- 2047 విధాన పత్రం డిసెంబర్ 6 తేదీ నాటికి పూర్తి కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.**

జయభేరి, హైదరాబాద్ :

ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని.. డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో తెలంగాణ రైజింగ్2047 దార్శనిక పత్రం, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుతో పాటు మంత్రివర్గ సహచరులు, అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా డిసెంబర్ 8, 9 వ తేదీ ఆవిష్కరించబోయే తెలంగాణ రైజింగ్ 2047 విధాన పత్రానికి సంబంధించి సోమ, మంగళవారాల్లో మంత్రులు, సంబంధిత విభాగాల అధికారులు తమ శాఖల పరిధిలోని ప్రతి అంశాన్ని చర్చించి క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. అలా అధ్యయనం చేసి క్రోడీకరించిన అంశాలను నివేదిక రూపంలో 2 వ తేదీ రాత్రి వరకు సమర్పించాలని, ఆ తర్వాత 3, 4 తేదీల్లో అన్ని శాఖలు ఇచ్చిన నివేదికలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రత్యేక కార్యదర్శితో

...మిగతాది 2 లో

# పార్లమెంట్ శీతాకాల సమావేశాలు



- పార్లమెంట్ ముందుకు ఢిల్లీ కాలుష్య సమస్య
- కాంగ్రెస్ పార్లమెంటరీ స్ట్రాటజీ సమావేశం
- పార్లమెంట్ ముందుకు రానున్న కీలక బిల్లులు
- కీలకం కానున్న SIR 2.0, ఓట్ల చోరీ, కాలుష్యం అంశాలు
- ఎర్రకోట కారు పేలుడు ఉగ్రదాడిపై ప్రకటన చేయనున్న కేంద్రం

జయభేరి, న్యూఢిల్లీ:

ఢిల్లీ వాయు కాలుష్యం ఈసారి పార్లమెంట్‌ను కమ్మేయనుంది.. అత్యంత ప్రమాదకర స్థాయిలో ప్రజలు శ్వాసించాలంటే భయపడేలా ఉన్న వాయు నాణ్యత గురించి దేశ అత్యున్నత చట్ట సభ అయిన పార్లమెంట్లో చర్చ పెట్టేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ శీతకాల సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తనున్నాయి. సోమవారం మొదలై డిసెంబర్ 19 వరకు 15 సిట్టింగుల్లో జరిగే సమావేశాలు వాడి వేడిగా జరగనున్నాయి. పార్లమెంట్ సమావేశాలు సజావుగా జరిగేందుకు విపక్షాల సహకారం కోరుతూ ఆదివారం కేంద్రం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు నేతృత్వంలో జరిగే సమావేశంలో అన్ని పార్టీల పార్లమెంటరీ పక్ష నేతలు పాల్గొన్నారు. బిల్లుల ఎజెండాను అన్ని పక్షాలకు అందజేయడమే కాకుండా సభ సజావుగా సాగేందుకు సహకరించాలని, కీలక బిల్లులపై జరిగే చర్చల్లో పాల్గొనాలని బిల్లుల ఆమోదానికి సహకరించాలని కేంద్రం విపక్షాలను కోరింది. ఇక పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై సోనియా నివాసంలో కాంగ్రెస్ నేతల కీలక సమావేశం జరగనుంది.

**పార్లమెంట్ ముందుకు ఢిల్లీ కాలుష్య సమస్య**

దేశవ్యాప్తంగా చలి ప్రతాపాన్ని చూపిస్తుంటే రాజధాని ఢిల్లీ కాలుష్యంతో సతమతమవుతోంది. కాలుష్యం పై మోదీ ప్రభుత్వం నోరు మెదపకపోవడం, ఢిల్లీ బీజేపీ ప్రభుత్వం పొల్యూషన్ తీవ్రతను తక్కువ చేసి చూపిస్తున్నారని ప్రతిపక్షాలు సహా ఇప్పటికే నగర యువత, పర్యావరణ వేత్తలు ఆందోళనల బాటపట్టారు. దీంతో ఢిల్లీ కాలుష్యంపై ప్రతిపక్షాలు స్పందించాయి. పార్లమెంట్ శీతాకాల సమావేశాలల్లో ఢిల్లీ వాయు కాలుష్యం పై చర్చించాల్సేందని ఇప్పటికే లోకసభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. దేశ రాజధాని ఢిల్లీలో నానాటికి క్షీణిస్తున్నా వాయు నాణ్యతపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఈ అత్యవసర

...మిగతాది 2 లో

## రాహుల్ గాంధీకి కేటీఆర్ సంచలన లేఖ




జయభేరి, హైదరాబాద్, నవంబరు30:

ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఇవాళ (ఆదివారం) బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రవేశపెట్టిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ పాలసీను స్వతంత్ర భారతదేశంలో అతిపెద్ద భూ కుంభకోణాల్లో ఒకటని ఆరోపణలు చేశారు. అత్యంత అవినీతితో కూడుకున్న ఈ విధానం తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర ఆందోళన, అనుమానాలు కలిగిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాల గురించి కాంగ్రెస్ హై కమాండ్‌కు తెలుసా.. లేకపోతే కావాలని మౌనంగా ఉన్నారా అని ప్రశ్నించారు. ఈ అవినీతి కారణంగా అత్యంత విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలు వాటి అసలు మార్కెట్ విలువలో నామమాత్రపు ధరకే పూర్తిగా సొంతం చేసుకోవడానికి వీలు కల్పిస్తోందని అన్నారు. దీనివల్ల తెలంగాణ ప్రజలకు రూ.5 లక్షల కోట్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని కేటీఆర్ హెచ్చరించారు. హైదరాబాద్ నగరంలోని బాలానగర్,

...మిగతాది 2 లో

## మన్ కీ బాత్‌లో కరీంనగర్ ప్రస్తావన



- కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ ఆర్ట్‌పై మోదీ ప్రశంసలు..!


జయభేరి, న్యూఢిల్లీ:

కరీంనగర్ లో ప్రసిద్ధి చెందిన సంప్రదాయ పూల ఆకృతితో ఉన్న సిల్వర్ మిర్రర్‌ను ఇటలీ ప్రధానికి బహుకరించానని ప్రధాని మోదీ చెప్పడంతో ఇప్పుడు ఫిలిగ్రీపై చర్చ నడుస్తుంది. వెండితో ఎన్నో రకాలుగా ఆభరణాలను తయారు చేసినా పిలిగ్రీ కళను మాత్రం కరీంనగర్ బిడ్డలు మాత్రమే అందిపుచ్చుకున్నారు. పిలిగ్రీ ద్వారా తమలోని కళను ప్రదర్శిస్తున్న కరీంనగర్ వాసుల చరిత ప్రపంచానికి సుపరిచితమే. గతంలో జి20 సమావేశాల్లోనూ కరీంనగర్ పిలిగ్రీ తళుకుమనిపించనుంది. కరీంనగర్ కళాకారులు తమ నైపుణ్యానికి పదునుపెట్టి తయారు చేసిన వస్తువులు జి20 దేశాల ప్రతినిధులకు ఈ బహుమతులు అందించారు.

...మిగతాది 2 లో

## వేడెక్కుతున్న పల్లెలు...

...మిగతాది 2 లో



## మైనర్లకు నో ఎంట్రీ..?

- సోషల్ మీడియాలో ఆధార్ వెరిఫికేషన్..
- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

జయభేరి, న్యూఢిల్లీ:

అశ్లీల ఆన్‌లైన్ కంటెంట్‌ను మైనర్లు యాక్సెస్ చేస్తుండటంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మైనర్లకి ప్రవేశం లేకుండా ఆధార్ బేస్డ్ వెరిఫికేషన్ సిస్టం ప్రవేశపెట్టాలని సూచించింది. ఇలాంటి వ్యవస్థ కోసం ఒక నియంత్రణ సంస్థ అవసరమని అత్యున్నత న్యాయస్థానం నొక్కి చెప్పింది. రకరకాల సోషల్ మీడియా యాప్స్ విచ్చలవిడిగా పుట్టుకొస్తున్నాయి. దీంతో యువత

...మిగతాది 2 లో

## బలహీనపడిన దిత్వా తుఫాన్

- చలిగాలులు.. చిరుజల్లులు
- ఉత్తర తమిళనాడుకు సమీపంలో తీవ్ర వాయుగుండంగా కేంద్రీకృతం
- కోస్తా, సీమలకు భారీ వర్ష సూచన
- నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు రెడ్ అలర్ట్
- మరో 48 గంటలు అలర్ట్‌గా ఉండాలి: హోంమంత్రి అనిత



జయభేరి, విశాఖపట్నం :

మూడు రాష్ట్రాలను దడ పుట్టించిన 'దిత్వా' తుఫాన్ బలహీనపడింది. ఉత్తర దిశ నుంచి వీస్తున్న పొడి చలిగాలులు, సముద్రంలో తుఫాన్ పరిసరాల్లో ఉన్న మేఘాలు విచ్ఛిన్నం కావడంతో ఆదివారం సాయంత్రానికి తీవ్ర వాయుగుండంగా బలహీనపడింది. శనివారం రాత్రి నుంచి తమిళనాడుకు సమాంతరంగా పయనించి ఆదివారం మధ్యాహ్నానికి ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరికి చేరువగా వచ్చింది. ఆ తరువాత వాతావరణం అనుకూలించకపోవడంతో మధ్యాహ్నం నుంచి జోరు తగ్గింది. అయితే తుఫాన్ ఆవరించిన

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

ఆరోగ్య పరిస్థితి పై త్వరలో ప్రారంభం కానున్న పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో చర్చించాలని డిమాండ్ చేశారు. వాయుకాలుష్యం వల్ల చిన్నారులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ఆయన కొంతమంది తల్లులతో తన నివాసంలో చర్చించారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ వేశారు. తాను కలిసిన ప్రతి మాతృమూర్తి ఒకే విషయం గురించి మాట్లాడుతున్నారని, పిల్లలు విష పూరిత గాలిని పీలుస్తూ పెరుగుతున్నారని చెబుతున్నారు. దేశంలోని చిన్నారులు మన ముందే ఇబ్బందులకు గురవుతున్నారు. అయినా ప్రధాని ఎలా మౌనంగా ఉండగలుగుతున్నారని? రాహుల్ ప్రశ్నించారు. అసలు ప్రభుత్వం ఎందుకు అప్రమత్తత, ప్రణాళిక, జవాబుదారీతనం చూపడం లేదు? గాలి కాలుష్యంపై పార్లమెంటులో చర్చ జరగాలని, ఈ అత్యవసర ఆరోగ్య పరిస్థితిని కట్టడి చేయడానికి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు సాయంత్రం సోనియాగాంధీ నివాసంలో కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశాన్ని నిర్వహిస్తోంది.. ముఖ్యంగా దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన SIR విధానంపై పార్లమెంట్ ను స్తంభింప జేయచాలని విపక్షాలు భావిస్తున్నాయి. దీనితో పాటు ఢిల్లీ వాయు కాలుష్యం అంశం కూడా పార్లమెంట్‌నూ కమ్మేయనుందన్న చర్చ జరుగుతుంది
పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రవేశ పెట్ట బోయే బిల్లుల జాబితాను కేంద్రం సిద్ధం చేసింది. ఈ సమావేశాల్లో ముఖ్యంగా పౌర అణు ఇంధన రంగంలో ప్రైవేట్ రంగానికి స్వాగతం పలికేందుకు ఉద్దేశించిన బిల్లుతోపాటు పది బిల్లులను ఈసారి పార్లమెంట్ ఉభయసభల్లో ప్రవేశపెట్టాలని మోదీ సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు లోకసభ, రాజ్యసభ బులెటెన్ లలో కేంద్రం ప్రభుత్వం పలు అంశాలను వెల్లడించింది. అణు ఇంధన బిల్లు, 2025 తోపాటు కార్పోరేట్ చట్టాల (సవరణ) బిల్లు2025, సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు2025, జాతీయ రహదారు ల(సవరణ) బిల్లులను ఉభయసభల ముందుకు తీసుకురానున్నారు. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇం డియా చట్టం 1992, డిపాజిటరీస్ చట్టం - 1996, సెక్యూరిటీస్ కాంట్రాక్ట్స్(నియంత్రణ) చట్టం - 1956 లను విలీనంచేసేందుకు ఉద్దేశించిన సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు2025ను తీసుకొస్తున్నారు. ఆర్బిట్రేషన్, కాన్సిలియేషన్ చట్టంలోని 34వ సెక్షన్ కు సవరణలు తేవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ది హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(హెచ్ సీఐ) బిల్లు అని పేరును ఖరారు చేశారు. విశ్వవిద్యాలయాలు, ఇతర ఉన్నత విద్యా సంస్థలు ఇకపై స్వయంప్రతిపత్తితో పారదర్శకతతో అత్యున్నత విద్యాప్రమాణాలను పాటించేలా చూడడమే ఈ బిల్లు లక్ష్యం. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను బీహార్ ఎస్ ఐ ఆర్ కుదిపేస్తే శీతాకాల సమావేశాలను SIR 2.0 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం కుదిపేయనుంది. దీనికి తోడు రాహుల్ గాంధీ ఓట్ల చోరీ అంశాన్ని మరోసారి పార్లమెంట్లో ప్రస్తావించే అవకాశం ఉంది. SIR 2.0కి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. నవంబర్ 10న ఎర్రకోట వద్ద జరిగిన కారు పేలుడులో 15 మంది చనిపోగా 20 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు.. దీనిపై కేంద్ర హోం మంత్రి పార్లమెంట్లో ప్రకటన చేయనున్నారు.. ఇప్పటికే ఈ కేసును NIA దర్యాప్తు చేస్తుండగా కీలక విషయాలను వెలుగులోకి తెస్తుంది..కేసు దర్యాప్తు పురోగతి సహా ఉగ్రవాదం పై భారత వైఖరి గురించి పార్లమెంట్ వేదికగా ప్రభుత్వం సమాధానం ఇవ్వనుంది. జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు 2025, ది ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ వోడ్ (సవరణ) బిల్లు 2025, భీమా చట్టాలు (సవరణ) బిల్లు 2025, మణిపూర్ వస్తు సేవల పన్ను (సవరణ) బిల్లు, 2025, జాతీయ రహదారులు (సవరణ) బిల్లు, 2025, ది అణుశక్తి బిల్లు, 2025, కార్పొరేట్ చట్టాలు (సవరణ) బిల్లు, 2025, సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు (SMC), 2025, ది ఆర్బిట్రేషన్ అండ్ కన్సిలియేషన్ (సవరణ) బిల్లు, 2025, భారత ఉన్నత విద్యా కమిషన్ బిల్లు 2025, రాజ్యాంగం (131వ సవరణ) బిల్లు 2025.

## రాహుల్ కి కేటీఆర్ సంచలన లేఖ


జీడిమెట్ల, సనత్‌నగర్, ఉప్పల్, మల్లాపూర్, రామచంద్రాపురం, హయత్‌నగర్ వంటి కీలక క్లస్టర్‌లలో గత ప్రభుత్వాలు సుమారు 9,300 ఎకరాల పారిశ్రామిక భూమిని కేటాయించాయని గుర్తుచేశారు. ఈ భూములను మొదట పారిశ్రామిక వృద్ధి, ఉపాధి కల్పన, దీర్ఘకాలిక ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించడానికి రాయితీ ధరలకు ఇచ్చారని పేర్కొన్నారు కేటీఆర్. అయితే, కొత్త HILTP కింద, పారిశ్రామిక భూములను కలిగి ఉన్నవారు ఇప్పుడు ఆ భూములను వాణిజ్య లేదా నివాస జోన్‌లుగా మార్చుకోవడానికి SRO (సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం) విలువలో కేవలం 30శాతం మాత్రమే చెల్లిస్తే చాలని చెప్పుకొచ్చారు. ప్రస్తుత మార్కెట్ ధరల చాలా రెట్లు ఎక్కువగా ఉన్నప్పటికీ, ఈ విధానం ప్రజలకు దక్కాల్సిన ఆస్తులను తక్కువ ఖర్చుతో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి, లక్షల కోట్ల విలువైన భూమిని నామమాత్రపు ధరకు క్రమబద్ధీకరిస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొందరపాటుతనం, ఈ మొత్తం పాలసీలో దాగున్న రాజకీయ అవినీతి అనేక ప్రశ్నలను లేవనెత్తుతోందని ధ్వజమెత్తారు. అలాగే, రాహుల్ గాంధీకి రెండు కీలక ప్రశ్నలు సంధించారు కేటీఆర్. తెలంగాణలో పెద్దఎత్తున జరుగుతున్న అక్రమాల గురించి వెంటనే స్పందించాలని కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న రూ.5 లక్షల కోట్ల అవినీతి స్కామ్‌ని అడ్డుకోవాలని సూచించారు. లేకపోతే దేశ చరిత్రలోనే అతి పెద్ద భారీ భూ కుంభకోణంలో రాహుల్ గాంధీ మౌనంగా ఉండటం సరికాదని అన్నారు. రాహుల్ గాంధీ స్పదించకపోతే ఈ స్కాంలో భాగస్వామ్యం ఉందని, కాంగ్రెస్ హైకమాండ్ అనుమతితోనే రూ.5 లక్షల కోట్ల భూకుంభకోణం తెలంగాణలో జరుగుతోందని భావించాల్సి ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ తన అవినీతి కోసం తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెడతామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తాము ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తునే ఉంటామని స్పష్టం చేశారు. తాను రాస్తున్న ఈ బహిరంగ లేఖకు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ హై కమాండ్ ఇచ్చే సమాధానం తెలంగాణ ప్రయోజనాలను కాపాడే విధంగా ఉండాలని కోరారు కేటీఆర్.

## బలహీనపడిన దిత్వా తుఫాన్

ప్రాంతం ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరికి మరింత చేరువై వాయుగుండంగా మారుతుందని భారత వాతావరణశాఖ తెలిపింది. ఈ క్రమంలో తీవ్ర వాయుగుండంగా మారి సాయంత్రానికి పుదుచ్చేరికి తూర్పు ఆగ్నేయంగా 90, చెన్నైకు దక్షిణ ఆగ్నేయంగా 140 కి.మీ.ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది ఆదివారం రాత్రి లేదా సోమవారం ఉదయానికి పుదుచ్చేరికి 20, చెన్నైకు 40 కి.మీ. దూరంలో సముద్రంలోకి రానున్నదని తెలిపింది. ఉత్తర దిశ నుంచి తుఫాన్ వైపుగా పొడి చలిగాలులు రావడం, తుఫాన్ పరిసరాల్లో మేఘాలు విచ్ఛిన్నం కావడంతో దాని తీవ్రత తగ్గిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఆదివారం ఉదయానికి తీవ్ర వాయుగుండంగా బలహీనపడిందని ఇస్రో వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. తీవ్ర వాయుగుండం సోమవారం ఉదయానికి వాయుగుండంగా బలహీనపడినా... చెన్నైకు చేరువగా రానున్నందున మేఘాలు ఉత్తర తమిళనాడు, దానికి ఆనుకుని దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ వైపుగా రానున్నాయి. దీంతో వర్షాలు పెరగనున్నాయి. రానున్న 24గంటల్లో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో మేఘాలు ఆవరించి చలిగాలులు వీస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి దక్షిణ కోస్తా, రాయలసీమలో వర్షాలు కురుస్తున్నాయి. తుఫాన్ ఉత్తర తమిళనాడుకు మరింత చేరువగా రానున్న నేపథ్యంలో రాత్రి నుంచి వర్షాలు పెరుగుతాయని, సోమవారం ఉదయం 8గంటల వరకు కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల వర్షాలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడా కుంభవృష్టి వర్షాలు, బాపట్ల, తిరుపతి, అన్నమయ్య, కడప జిల్లాల్లో అతిభారీ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, పల్నాడు, చిత్తూరు, నంద్యాల, శ్రీసత్యసాయి, నంద్యాల, అనంతపురం జిలాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ, విపత్తుల నిర్వహణ శాఖలు తెలిపాయి. మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లరాదని, రైతులు పంటల ఉత్పత్తుల రక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణశాఖ సూచించింది. కృష్ణపట్నం, నిజాంపట్నం, ఓడరేవు, మచిలీపట్నం ఓడరేవుల్లో మూడో నంబరు, కోస్తాలో మిగిలిన రేవుల్లో రెండో నంబరు భద్రతా సూచికలు ఎగురవేశారు. కాగా, ఆదివారం ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు కావలిలో 103.5, కావలి దరి అరుంధతి పురంలో 84.5, జలదంకిలో 66.25, చామదాలలో 63.0 మి.మీ.ల వర్షపాతం నమోదైంది.
దిత్వా తుఫాన్ పట్ల ఆది, సోమవారాల్లో అధికారులు మరింత అలర్ట్‌గా ఉండాలని హోం మంత్రి అనిత స్పష్టం చేశారు. ఆదివారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి తుఫాన్ పరిస్థితిని మంత్రి సమీక్షించారు. తుఫాన్ ప్రభావం ఉండే నెల్లూరు, తిరుపతి, కడప, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'తుఫాన్ వల్ల ప్రాణ నష్టం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిది. క్షేత్రస్థాయిలో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలి. ప్రమాదకర ప్రదేశాల వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులను నియమించాలి.

# వేడెక్కుతున్న పల్లెలు...

**సర్పంచి ఎన్నికల్లో బిజీ బిజీగా అభ్యర్థులు... కుల మత పరంగా ఓట్లు దండుకునే దానికి శ్రీకారం.. గ్రామంలో అవగాహన కలిగిన వారికి ఓటు వేద్దామా.? అవసరం కోసం ఎన్నికల్లో నిలబడి అవకాశాన్ని దక్కించుకుందమా? అనే వారికి ఓటు వేద్దామా..? సామాజిక, రాజకీయ సంక్షేమ అభివృద్ధి దిశలో ఆలోచించని అభ్యర్థులను ఎన్నుకుందామా..? ఇదే సరైన సమయం ఆలోచించి ఓటు వేయాల్సిన తరుణం..**




కడారి శ్రీనివాస్
జయభేరి సీనియర్ జర్నలిస్ట్,
98489 62799
కవి రచయిత, గాయకుడు,
తెలంగాణ ఉద్యమకారుడు,
గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీత

జయభేరి, హైదరాబాద్ :
తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించే ఎన్నికలకు శ్రీకారం చుట్టింది తెలంగాణ ప్రభుత్వం... సర్పంచి ఎన్నికల్లో భాగంగా ఇప్పటికే నామినేషన్లు వచ్చే నెల మూడో తారీకు వరకు జరగనున్న నేపథ్యంలో ఆశవాదులు సర్పంచి ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు... ఇక సర్పంచ్ ఎన్నికలు ఒకవైపు ఉంటే వార్డు మెంబర్ల ఎంపికలో అసాధారణంగా మలుపు తిప్పే రాజకీయాలకు శ్రీకారం చుట్టింది... తన మన భేదం లేకుండా రాజకీయాల్లో అభ్యర్థులను గెలిపించుకోవాలన్న ప్రజాస్వామ్య చరిత్రలో ఇప్పుడు కులమత రాజకీయాలకు శ్రీకారం చుడుతోంది... పల్లెలు కాస్త వేడెక్కి రాజకీయ వాతావరణం నువ్వెంత అంటే నువ్వెంత అనే విధంగా రాజుకుంటున్నాయి...
సర్పంచి ఎన్నికల్లో భాగంగా ఇప్పటికే అనేక సోషల్ మీడియాలో సర్పంచ్ ఎన్నికలకు ఎవ్వరు కూడా తమ స్థిర చర ఆస్తులు అమ్ముకోకుండా నిజాయితీగా పోటీ చేయండి ఒకవేళ డబ్బు ఎక్కువగా ఖర్చు పెడితే గనుక మీకు ఒక్క రూపాయి కూడా రాదు అని దండం పెట్టి చెబుతున్న గ్రామస్థాయిలో సర్పంచి స్థానానికి ఆశవాదులు బాగానే ముందుకు వస్తున్నారు... వాస్తవానికి సర్పంచి ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అయ్యే విధంగా అభ్యర్థులు ఉండాలే కానీ గ్రామస్థాయిలో పార్టీలను బేస్ చేసుకుని అభ్యర్థులు ఒకరిపై ఒకరు పోటీ పడుతూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే విధంగా ప్రయత్నాలు జోరుగా జరి పిస్తున్నారు.. ఇక తెలంగాణ పల్లెలో సర్పంచ్ ఎన్నికలకు గాను నల్లగొండ జిల్లాలోని ఇటుకలపాడు గ్రామంలో సర్పంచ్ స్థలానికి పలువురు అభ్యర్థులు పోటీపడుతున్న గత చరిత్రను గుర్తుపెట్టుకుని సర్పంచ్కి ఎవరు ఓట్లు వేయాలో వేయకూడదు అనే విషయంలో చాలా క్లారిటీ వచ్చినట్టుగా కనిపిస్తోంది. ఇక అదే దిశలో వార్డు మెంబర్లుగా ఎన్నుకునే అభ్యర్థులకు కనీసం వార్డ్ మెంబర్ కు ఉండే అర్హత కూడా తెలియకపోవడం విడ్డూరంగా కనిపిస్తుంది. వార్డు మెంబర్ అంటే కుల మత ప్రాంతాలకు అతీతంగా సాగాల్సిన సర్పంచి వార్డు మెంబర్ల ఎలక్షన్ లో కేవలం వార్డు మెంబర్ల స్థానంలో పూర్తిగా మన కులం వాడు అనే విధంగా ఎలక్షన్లు నడవడం వారికి వత్తాసు పలికే వారు సైతం వరుసలు కలుపుకొని ఒత్తిడి తీసుకురావడం సర్వసాధారణం అయిపోయింది..
వార్డు మెంబర్ మన కులం వాడైతే ఓటు వేయాల్సిందేనా..!?
మనది ఫలానా వార్డు అయితే మన ప్రాంతంలోని వాడు అనర్హుడు అయిన వాడిని కూడా ఎలక్షన్ లో నిలబడితే అతనికి ఓటు వేసి వార్డు మెంబర్గా గెలిపించాలా..? ఇదే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారుతుంది. అధికార కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అభ్యర్థి అయినా సరే తనకి ఎందుకు ఓటు వేయాలా అనే ఆలోచన ప్రజల్లో బలంగా నాటుకు పోయింది. ఎందుకంటే వార్డు మెంబర్గా వచ్చే వారికి కనీసం అర్హతలు ఏంటో కూడా తెలియని పరిస్థితిలో గ్రామస్థాయిలో వార్డ్ మెంబర్ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులకు కనీస అవగాహన లేకపోవడం విడ్డూరంగా మారుతుంది... అవార్డులో ఎన్ని ఓట్లు ఉంటాయి వారికి ఏమేమి అవసరాలు ఉన్నాయి ఏమేమి సంక్షేమం అభివృద్ధి జరగాలి అనే వాటిపై అవగాహన లేకుండానే కులపరంగా మతపరంగా ఓట్లను రాబట్టుకోవడానికి అభ్యర్థులు చేస్తున్న ప్రయత్నాలు అంత ఇంత కాదు... మన కులం వాడే మన కులం వాన్ని గెలిపించుకోకపోతే ఎట్లా? నువ్వు ఏం ఆలోచించుకుంటావు అంటూ ఎదురు ప్రశ్నలకు తావులేపే వారు కూడా ఓట్లు వేసే అభ్యర్థులను ఇరకాటంలో పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నారు... గ్రామ స్థాయిలో జరిగే ఎలక్షన్లు గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అవ్వాల్సిందే కానీ కుల మత రాజకీయాలు అస్సలు విజయాన్ని అందుకోలేవని విషయాన్ని ఈ సమాజం ఎప్పుడు అర్థం చేసుకుందో అర్థం కావడం లేదు...
గ్రామస్థాయిలో ఎలక్షన్లో రావడంతోనే పూర్తిగా పల్లెలు పగలు ప్రతీకారాలు రాజకీయ కక్షలు చుట్టూ వ్యాపిస్తున్నాయి. నిన్నటి మొన్నటి వరకు బాబాయి మామ అన్న తమ్ముడు అనుకునే వరసలు కాస్త నీది ఆ పార్టీ నాది ఈ పార్టీ నీకు నాకు పొత్తు కుదరదు అంటూ మాట్లాడుకునే భాషలు ఇప్పుడు పల్లె వాతావరణన్ని మార్చేస్తున్నాయి.. రాజకీయంగా పల్లెలు వేడెక్కుతున్న ఈ సందర్భంలో గ్రామ ప్రాంతాలలో నివసించే ప్రజలు వార్డ్ మెంబర్ దగ్గర నుంచి సర్పంచ్ వరకు ఎవరు మనకు అందుబాటులో ఉంటారు ఎవరికి ఓటు వేస్తే మనకు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పాటు అవుతారు అనే విషయాలపై పూర్తిగా గ్రామ స్థాయిలను ఓటర్లు అవగాహన కల్పించుకోవాలి.. అలాగే కులపరంగా మతపరంగా అభ్యర్థులు ఓట్లను అడుగుతున్నప్పుడు వారి స్వార్థపు ఆలోచనలు ఏంటో కచ్చితంగా ఓటర్లు గ్రామస్థాయిలో సర్పంచి ఎన్నికల్లో బలంగా ఆలోచించుకోవాలి. మన కులం వాడే మన మతం వాడే అంటూ ఆలోచించుకొని ఓటు వేసే క్రమంలో పూర్తిగా ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచిన వారే అయిపోతారు... వాస్తవానికి మన కులం వాడే మన వార్డులో మన కులం వాన్ని గెలిపించుకుందాం అనే మాటలు పూర్తిగా స్వార్థపూరితంగా ఉండే విధంగా ఉంటాయన్న ఆలోచనకు గ్రామస్థాయిలోని ఓటర్లు ఆలోచించుకోవాలి... గ్రామ సర్పంచిగా గ్రామస్థాయిలో పూర్తిగా మౌలిక సామాజిక అంశాలపై అవగాహన ఉన్న వ్యక్తులను చదువుకున్న వ్యక్తులను సర్పంచ్లుగా ఎన్నుకోవడానికి గ్రామంలోని ప్రజలు నిర్ణయించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది...
సర్పంచి ఎన్నికలు ఎప్పుడైతే మొదలయ్యాయి ఆ రోజు నుంచి ఈరోజు వరకు ఎన్నికలు అయిపోయే వరకు గ్రామస్థాయిలో రాజకీయ వాతావరణం వేడెక్కి నువ్వు ఎంత అంటే నువ్వు ఎంత అనుకునే దిశగా సాగుతున్నాయి ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు ఎవరి రాజకీయం వారు చేస్తున్నారు. ఎవరిని ప్రసన్నం చేసుకుంటే ఎక్కువగా ఓట్లు వస్తున్నాయో వారిని ప్రసన్నం చేసుకొని వారి నుంచి వచ్చే ఓట్లకు ఏరా వేసే విధంగా రాజకీయ కుటీల పన్నాగాలకు శ్రీకారం చుడుతున్నారు... ఇక తెలంగాణ రాష్ట్రంలో ఆయా సర్పంచ్ ఎన్నికల్లో సర్పంచ్ ఎన్నికలకు పోటీ చేయొద్దు అని గతంలో సర్పంచి ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన వారు బిల్లులు రాక వారు పడుతున్న బాధలు తట్టుకోలేక వారు సోషల్ మీడియాలో చెప్పిన అనేక సంగతులు బహిర్గతమవుతున్న అప్పటికి సర్పంచ్ ఎన్నికలకు అభ్యర్థులు సన్న హాలు జోరుగా కొనసాగిస్తున్నారు... సర్పంచ్ తో పాటు వార్డు మెంబర్గా నేనంటే నేనే అనే విధంగా కుల మత పరంగా ప్రసన్నం చేసుకునేందుకు ఆశావాదులు గట్టి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు...
ఈ నేపథ్యంలో కొన్ని గ్రామాల్లో ఆయ వార్డు మెంబర్గా ఎన్నిక జరిగే జనరల్ అభ్యర్థుల స్థానంలో అనేక వర్గాల వారు పోటీ చేస్తున్న సందర్భంలో మన కులం వాన్ని మన వార్డు మెంబర్గా ఎన్నుకుందామా అనే సందేహాలను లేవనెత్తుతూ ఆయా కుల సామాజిక వర్గాలను ప్రేలపితం చేసే రాజకీయాలు కూడా జోరుగా కొనసాగిస్తున్నాయి. వాస్తవానికి కనీసం ఆయా వార్డు మెంబర్లుగా ఎన్నిక కావడానికి కనీస అర్హతలు లేకపోయినప్పటికీ తాము వార్డు మెంబర్గా ఎన్నిక కావడానికి ఆయా రాజకీయ పార్టీల మద్దతును కూడగట్టుకుని ఓట్లు దండుకునే విధంగా ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి... ఇక గ్రామంలోనే ఉంటూ గ్రామంలో అనేక సంక్షేమాన్ని చూసుకుంటూ గ్రామ ప్రజలకు ఎటువంటి ఆపద ఆరోగ్య సమస్యలు వచ్చిన ఆర్థికంగా వారిని ఆదుకునే విధంగా ఉన్నవారు సార్వత్రిక ఎన్నికల్లో వార్డు మెంబర్ గా అవకాశం వచ్చిన వారు పోటీ చేస్తున్న వారి గురించి ఆలోచించే అవకాశాన్ని కూడా ఆయా కులం వార్డు మెంబర్లు ఇవ్వకపోవడం గమనార్హం.... గ్రామస్థాయిలో జరిగే ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు తావివ్వకుండా కేవలం గ్రామస్థాయిలో అభివృద్ధి సంక్షేమం జరిగే లాగున నిర్ణయం తీసుకుంటే మంచిది. అంతేకానీ కులం మతం అంటూ ప్రజాస్వామ్య నీడలో స్వార్థానికి చోటిస్తే అర్హత లేని వాళ్లకు అధికారాన్ని కట్టబెడితే పూర్తిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినట్లే అవుతుంది.... గ్రామంలో విద్య వైద్యం ఆరోగ్య విషయాల్లో మనకు ఎవరెవరు ఎలాంటి సహాయం చేస్తున్నారో ఆలోచిస్తూ ఎవరు ఏ స్థానంలో నిలబడ్డారు గమనిస్తూ వారికి తగిన విధంగా మద్దతును ప్రకటించే దిశలో ఓటర్లు తన గమ్యాన్ని ప్రకటించుకుంటే ప్రజాస్వామ్యం పరిడవల్లుతుంది... ప్రజాస్వామ్య నీడలో ఎలక్షన్లు జరిగితే కులాలకు మతాలకు అతీతంగా జరిగే ఎలక్షన్లో సంక్షేమం అభివృద్ధి ఎక్కువగా జరుగుతుంది.

## తెలంగాణ రైజింగ్ విజన్

ఇండియన్ స్కూల్ అఫ్ బిజినెస్, NITIఆయోగ్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలను భాగస్వామ్యం చేసి, ప్రతి అంశాన్ని లోతుగా క్షుణ్ణంగా విశ్లేషించి డాక్యుమెంట్‌లో భవిష్యత్తు ప్రణాళికలను సిద్ధం చేశాం. రాష్ట్ర సమగ్ర అభివృద్ధిని సాధిస్తూ బలమైన ఆర్థిక శక్తిగా ఎదగడానికి తెలంగాణను మూడు విభాగాలుగా విభజించి స్పష్టమైన ప్రణాళికలను రూపొందించాం. హైదరాబాద్ ఓఆర్ఆర్ అంతర్భాగంలో ఉన్న ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీగా గుర్తించాం. ఇప్పటివరకు ఈ ప్రాంతంలో గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, జీహెచ్ఎంసీ వంటి 4 రకాల పాలన సాగుతుండేది. అలాంటి సంక్షోభాలను హైదరాబాద్ నగరానికి ఎదురుకాకుండా ఉండేందుకు 2170 చదరపు కి.మీ కోర్ అర్బన్ ప్రాంతాన్ని సర్వీస్ సెక్టర్‌గా గుర్తిస్తున్నాం. కాలుష్యాన్ని వెదజల్లుతున్న పరిశ్రమలను బయటకి తరలిస్తున్నాం. వరద సమస్యలు, ట్రాఫిక్ సమస్యలు లేకుండా తీర్చిదిద్దుతాం. అలాగే కోర్ అర్బన్ రీజియన్ ఒక యూనిట్‌గా మెట్రో విస్తరణ, మూసీ అభివృద్ధి రోడ్ల విస్తరణ వంటి అన్ని రకాల ప్రణాళికతో ముందుకు వెళ్లడానికి ఈ ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీగా గుర్తించి సర్వీస్ సెక్టర్‌గా మార్చుతున్నాం. ఓఆర్ఆర్ అవతలి వైపు నుంచి తెలంగాణకు మణిహారంలా చేపడుతున్న రీజినల్ రింగ్ రోడ్డు వరకు పెరీ అర్బన్ ఎకానమీ కింద (ప్యూర్) గుర్తించి ఆ ప్రాంతంలో మాన్యుఫాక్చరింగ్ జోన్‌గా నిర్దేశించడం జరిగింది. అందులో ఫ్యూచర్ సిటీ, మెట్రో విస్తరణ, రేడియల్ రోడ్లు, బెంగుళూరు - హైదరాబాద్, అమరావతి మీదుగా హైదరాబాద్ - చెన్నై బుల్లెట్ ట్రెయిన్స్ ప్రతిపాదించాం. వీటి వల్ల రవాణా సులభతమవుతుంది. తెలంగాణకు సముద్రం లేని కారణంగా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో మచిలీపట్నం పోర్టు వరకు డెడికేటెడ్ గ్రీన్ ఫీల్డ్ హైవేను నిర్మించబోతున్నాం. ఇందుకోసం ఇప్పటికే కేంద్రం, ఏపీ రాష్ట్రాలతో సంప్రదింపులు కూడా పూర్తయ్యాయి. పరిశ్రమలు అభివృద్ధి చెందాలంటే, పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతులు, దిగుమతుల కోసం పటిష్టమైన రవాణా వ్యవస్థ ఉండాలి. మాన్యుఫాక్చరింగ్ జోన్‌లో హైవేలు, పోర్టు కనెక్టివిటీ, ఎయిర్ పోర్టు కనెక్టివిటీ ఉండాలి. వరంగల్‌లో నిర్మిస్తున్న విమానాశ్రయంతో పాటు ఆదిలాబాద్, కొత్తగూడం, రామగుండంలో ఎయిర్ పోర్టులు అదనంగా తెస్తాం. కనెక్టివిటీ పెంచడం ద్వారా తెలంగాణ ఆర్థిక వ్యవస్థను బలమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దగలం.
నాణ్యమైన విద్య, వైద్యం అందడం లేదు. మారుమూల తండా నుంచి హైదరాబాద్ వరకు సమగ్రాభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రాన్ని 2034 నాటికి 1 ట్రిలియన్ ఆర్థిక శక్తిగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ సంకల్పం. మా దార్శనికతే మా భవిష్యత్తు ప్రణాళికలు. తెలంగాణను బలమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే క్రమంలో ముందుకు వెళ్లడానికి ప్రముఖులందరినీ ఆహ్వానిస్తున్నాం. బిజినెస్, స్పోర్ట్స్, ఇండస్ట్రీ, అగ్రికల్చర్, టూరిజం... ఇలా అన్ని రంగాల్లో ప్రగతికి అవసరమైన అన్ని అంశాలు పాలసీలో ఉంటాయి. మా రోల్ మాడల్ చైనా, జపాన్, దక్షిణ కొరియా, జర్మనీ, సింగపూర్‌లను ఆదర్శంగా తీసుకుని వారితో పోటీ పడదలుచుకున్నాం. మా పోటీ అభివృద్ధి చెందిన దేశాలే.. వారినే ఆదర్శంగా తీసుకున్నాం. ఈ సంకల్పానికి మా ప్రభుత్వానికి అందరి సహకారం కావాలి.." అని కోరారు. ఈ సందర్భంగా మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు.

## డాక్యుమెంట్ సంపూర్ణంగా సిద్ధం

పాటు ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు పరిశీలించి అవసరమైన మార్పు చేర్పులతో తుది ప్రతిని సిద్ధం చేయాలని చెప్పారు. 6 వ తేదీ సాయంత్రం వరకు తెలంగాణ రైజింగ్ విజన్ 2047 డాక్యుమెంట్ సంపూర్ణంగా సిద్ధం చేయాలని, అందుకు అనుగుణంగా విభాగాల అధికారులు దార్శనిక పత్రం రూపకల్పన కోసం పూర్తి సమయం వెచ్చించాలని సూచించారు. అలాగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు నిర్వహణలో శాఖల మధ్య సమన్వయం ఉండాలని చెప్పారు. ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పాలన సందర్భంగా పలు ఉమ్మడి జిల్లాల్లో ఒకరోజు ఉత్సవాలను నిర్వహించనున్నారు. డిసెంబర్ 1 వ తేదీన మక్తల్‌లో, 2 వ తేదీన కొత్తగూడెంలో, 3 న హుస్నాబాద్‌లో, 4 న ఆదిలాబాద్‌లో, 5 వ తేదీన నర్సంపేటలో, 6 వ తేదీన దేవరకొండలో ఉత్సవాలు నిర్వహిస్తారు. వీటిల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. ఈ ఉత్సవాల్లో సంబంధిత ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు అందరూ పాల్గొంటారు. ఆ తర్వాత డిసెంబర్ 7 వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొని ముఖ్యమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతారు. డిసెంబర్ 8, 9 వ తేదీల్లో భరత్ ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ. చివరగా డిసెంబర్ 13 న ప్రపంచ ఫుట్ బాల్ దిగ్గడం GOAT లియోనెల్ మెస్సీ పాల్గొనబోయే ఉప్పల్ స్టేడియంలో నిర్వహించే ఫుట్‌బాల్ మ్యాచ్‌తో ఉత్సవాలు ముగుస్తాయి.

## మైనర్లకు నో ఎంట్రీ..?

వీటికి ఎడిక్ట్ అయిపోతున్నారు. 24 గంటలు సోషల్ మీడియాలోనే ఉంటూ తమ విలువైన జీవితాన్ని కోల్పోతున్నారు. అంతేకాకుండా సోషల్ మీడియాకు ప్రభావితమై అనేక చెడు పనులకు కూడా పాల్పడుతున్నారు. చిన్న వయస్సులోనే సోషల్ మీడియాకు బానిసలుగా మారడం ద్వారా మానసికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఆస్ట్రేలియా 18 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా వాడకుండా నిషేధం విధించగా.. మరికొన్ని దేశాలు కూడా ఈ దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ క్రమంలో ఇండియాలో కూడా సోషల్ మీడియాలోకి మైనర్లకు అనుమతి లేకుండా నిబంధనలు తీసుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఇదే తరుణంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మైనర్లు అనుచిత ఆన్‌లైన్ కంటెంట్ వినియోగించకుండా ఆధార్ ఆధారిత వయస్సు ధృవీకరణ చేయాలని సూచించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య గుర్చి నేతృత్వంలోని ధర్మాసనం తాజాగా ఓ కేసులో ఈ విషయాన్ని నొక్కి చెప్పింది. మైనర్లు అశ్లీల ఆన్‌లైన్ కంటెంట్‌ను చూడకుండా కఠిన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలిపింది. ప్రస్తుతం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లోకి మైనర్లకు కూడా అనుమతి ఉంది. సోషల్ మీడియా యాప్స్ వయస్సు ధృవీకరణ చేయడానికి సరైన డాక్యుమెంట్స్ కూడా పరిశీలించకుండా సోషల్ మీడియా వాడటానికి అనుమతి ఇస్తున్నాయి. వయస్సును తప్పుగా ఎంటర్ చేసి మైనర్లు సోషల్ మీడియాలోకి ఎంట్రీ అవుతున్నారు. మైనర్లు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో అశ్లీల కంటెంట్‌ను కూడా యాక్సెస్ చేయగలుగుతున్నారు. దీంతో ఆధార్ బేస్డ్ వెరిఫికేషన్ వ్యవస్థను సోషల్ మీడియాలో తీసుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్న హాస్యనటులు, పాడ్‌కాస్టర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఆన్‌లైన్ కంటెంట్‌ను నియంత్రించడానికి బలమైన ఒక నియంత్రణ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడింది. ప్రాథమిక హక్కులను సమతుల్యం చేయడానికి, ముఖ్యంగా వికలాంగులను కించపరిచే ఆన్‌లైన్ కంటెంట్‌ను ఎదుర్కోవడానికి కఠినమైన చట్టాలు అవసరమని స్పష్టం చేసింది.

## మన్ కీ బాత్‌లో కరీంనగర్

గతం లో జి20 సమ్మిట్‌కు హాజరైన 20 దేశాల ప్రతినిధులకు కరీంనగర్ సిల్వర్ పిలిగ్రీ బ్యాడ్జెస్ ఇచ్చారు. అత్యంత అరుదైన కళల్లో ఒకటైన సిల్వర్ పిలిగ్రీ కళ దేశంలోనే చాలా తక్కువమంది నేర్చుకున్నారు. తెలంగాణాలోని కరీంనగర్‌కు చెందిన వారితో పాటు ఒడిశాలోని కటక్ ప్రాంతానికి చెందిన వారు కూడా ఈ కళను అందిపుచ్చుకున్నారు. అయితే కరీంనగర్ కళాకారులు వారసత్వంగా వచ్చిన సిల్వర్ పిలిగ్రీ కళను నేటికీ పోషిస్తూ తమలోని కళా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నారు. జీఐ కూడా పొందిన కరీంనగర్ సిల్వర్ పిలిగ్రీ కళాకారులు గతంలో హైదరాబాద్‌కు ఇవాంకా ట్రంప్ వచ్చినప్పుడు స్టాల్ ఏర్పాటు చేసుకునే అవకాశం దక్కింది. కానీ ఈ సారి ఏకంగా అంతర్జాతీయ స్థాయిలో జరిగిన జి20 సమ్మిట్ ప్రతినిధులకు బహుమతులు అందుంచారు. అంతేకాకుండా న్యూ ఢిల్లీలో జరగనున్న సమ్మిట్ సందర్భంగా దేశంలోనే అరుదైన కళాత్మకతను ప్రదర్శించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా స్టాళ్లను ఏర్పాటు చేసింది. ఇందులో కూడా కరీంనగర్ కు చెందిన అశోక్ స్టాల్‌ని ఏర్పాటు చేసుకునే అవకాశం దక్కింది. ఈ స్టాల్‌లో కరీంనగర్ సిల్వర్ పిలిగ్రీ కళాకారుల చేతిలో తయారు చేసిన అద్భుత కళాఖండాలు ప్రదర్శించనున్నారు. దీనివల్ల జి20 దేశాల్లో భారత్‌లో ఉన్న అత్యంత అరుదైన కళకు గుర్తింపు లభించింది. కళల కాణాచిగా పేరుపడిన కరీంనగర్ వాసులు మరోసారి అంతర్జాతీయ సమాజం ముందు తమలోని కళాత్మకతను ప్రదర్శించిన విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు. మన్ కీ బాత్ లో పీఎం ఫిలిగ్రీ కళ గురించి ప్రస్తావించారు. కరీంనగర్‌లో తయారు చేసిన సిల్వర్ ఫిలిగ్రీ బహుమతులు.. వివిధ దేశాధినేతలకు అందించానని అన్నారు. ఈ బహుమతిలు తీసుకున్న నేతల సంతోషాన్ని వ్యక్తం చేశారని పీఎం గుర్తు చేశారు. ప్రధాని ప్రకటన తరువాత ఫిలిగ్రీ కళపై చర్చ మొదలైయింది. కళాకారులూ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ కళను కాపాడుకోవడానికి ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

# దీక్ష దివాస్ లో దుప్పట్లు పంపిణీ

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, ఉప్పల్ :



తెలంగాణ సాధన కోసం కేసీఆర్ చేపట్టిన చారిత్రాత్మక దీక్షను స్మరించుకుంటూ BRS పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు బద్రుద్దీన్ ఆధ్వర్యంలో మల్లాపూర్ స్వాగత్ కన్వెన్షన్ లో జరిగిన దీక్ష దివాస్ లో మాజీ హోం మంత్రి మహమ్మద్ అలీతో కలిసి పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కెసిఆర్ చేసిన ఉద్యమ పోరాటం, గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు గుర్తు చేయనున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో అన్న తెగువతో నాలుగు కోట్ల మందిని ఏకం చేసి, కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు అన్ని రాజకీయ వ్యవస్థలను ఒప్పించి మెప్పించి కుల మతాలకు అతీతంగా ఏకం చేసిన దీక్షా దివాస్ ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. కేసీఆర్ సంకల్ప బలానికి, దీక్షాదక్షతకు సాక్ష్యం దీక్షా దివస్ అని ఆయన అన్నారు. అరవై ఏండ్ల గాయాలు, వేదనలను తెలంగాణ కన్నీళ్లను తీర్చిన ఉద్యమ నాయకుడు కేసీఆర్ అని ఆయన తెలిపారు. గాలి, నీరు, నేల ఉన్నంత కాలం తెలంగాణలో కేసీఆర్ అనే మూడక్షరాలు పదిలం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఇంతియాజ్, అజం అలీ, కలీం, మల్కాజ్ గిరి పార్లమెంట్ ఇంఛార్జి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు దేవేందర్ రెడ్డి, గీత ప్రవీణ్ ముదిరాజ్, రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్, కార్యకర్తలు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డి సంఘం నూతన కమిటీ ఏకగ్రీవం

- గౌరవ అధ్యక్షులు బొల్లపల్లి శ్రీనివాస్ రెడ్డి, కేతిరెడ్డి శశిధర్ రెడ్డి
- అధ్యక్షులు బండం వెంకట్ రెడ్డి
- ప్రధాన కార్యదర్శి P.శేఖర్ రెడ్డి
- కోశాధికారి C. రఘుపాల్ రెడ్డి





జయభేరి, మేడిపల్లి :

చెంగిచర్ల రెడ్డి సంఘము నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం కార్యక్రమం ముగిసింది. రెడ్డి సంఘం చెంగిచర్ల ఆడక్ కమిటీ మోతే రఘు తిరుపతిరెడ్డి, చిర్ర శ్రీధర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి, ఆధ్వర్యంలో నూతన రెడ్డి సంఘం ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులు బొల్లపల్లి శ్రీనివాస్ రెడ్డి, కేతిరెడ్డి శశిధర్ రెడ్డి, అధ్యక్షులు బండం వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు Ch.మోహన్ రెడ్డి, R.రాజేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి P.శేఖర్ రెడ్డి, కోశాధికారి C.రఘుపాల్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ చందర్ గౌడ్, బింగి జంగయ్య యాదవ్, కో ఆప్షన్ మెంబర్ రంగా బ్రహ్మన్న గౌడ్ నూతన కమిటీని శాలువతో సత్కరించినారు. నూతన రెడ్డి సంఘం కమిటీకి శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమం రెడ్డి సంఘం చెంగిచెర్ల కమిటీ సభ్యులు, రెడ్డి సంఘం కుటుంబ బంధువులు పాల్గొన్నారు.



# నామినేషన్లు తిరస్కరణ

జయభేరి, యాదగిరిగుట్ట:



స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా యాదగిరిగుట్ట మండలంలోని భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్లకు సంబంధించిన వివరాలను యాదగిరిగుట్ట ఎంపీడీవో నవీన్ కుమార్ ఆదివారం ప్రకటించారు. యాదగిరి గుట్ట మండలంలోని మొత్తం 23 గ్రామాలల్లో సర్పంచ్ కు 162,వార్డుమెంబర్ 575 నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు. నామినేషన్ల కోసం ఏర్పాటు చేసిన ఐదు క్లస్టర్ లలో భాగంగా దాతారుపల్లి క్లస్టర్ లోని దాతార్ పల్లి గ్రామంలో సర్పంచ్ లకు8, వార్డులకు 42, జంగంపల్లి గ్రామంలో సర్పంచ్ లకు 6, వార్డులకు 27, రాళ్లజనగాం గ్రామంలో సర్పంచ్ లకు5,వార్డులకు 20, లప్పానాయక్ండాలో సర్పంచ్ లకు 5,వార్డులకు 15,మల్లాపురంలో సర్పంచ్ లకు 10, వార్డులకు 35 నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు. పెద్దకందుకూరు కస్టర్ పరిధిలోని పెద్దకందుకూరు గ్రామంలో సర్పంచ్ లకు 9, వార్డులకు 36, చిన్నకందుకూరు సర్పంచ్ లకు 10,వార్డులకు 22, బాహుపేట సర్పంచ్ లకు7, వార్డులకు 27, తాళ్లగూడెం సర్పంచ్ లకు 5,వార్డులకు 9, రామాజీపేట సర్పంచ్ లకు 8, వార్డులకు 20 నామినేషన్లు దాఖలు కాగా, వంగపల్లి క్లస్టర్ పరిధిలోని వంగపల్లి గ్రామంలో సర్పంచ్ లకు11,వార్డులకు 34, చొల్లేరు సర్పంచ్ లకు 8, వార్డులకు 29, మర్రిగూడెం సర్పంచ్ లకు 7,వార్డులకు 20, మహబూబ్ పేట సర్పంచ్ లకు 8, వార్డులకు 19 నామినేషన్లు దాఖలయ్యాయి.

గౌరాయపల్లి క్లస్టర్ పరిధిలోని గౌరాయపల్లి గ్రామంలో సర్పంచ్ లకు 6 వార్డులకు 31, చిన్నగౌరాయపల్లి సర్పంచ్ లకు7, వార్డులకు 19, సాధువెల్లి గ్రామంలో సర్పంచ్ లకు 6,వార్డులకు 31, కంతంగూడెం సర్పంచ్ లకు 3, వార్డులకు 11, ధర్మారెడ్డిగూడెం సర్పంచ్ లకు 8, వార్డులకు 17 దాఖలయ్యాయని, మాసాయిపేట క్లస్టర్ పరిధిలోని మాసాయిపేట గ్రామంలో సర్పంచ్ లకు10, వార్డులకు 44, సైదాపురం సర్పంచ్ లకు5,వార్డులకు 32, మైలారిగూడెం సర్పంచ్ లకు4, వార్డుల 24, కాచారం సర్పంచ్ లకు 8, వార్డులకు 21 నామినేషన్లు దాఖలైనట్లు యాదగిరిగుట్ట ఎంపిడీవో నవీన్ కుమార్ తెలిపారు. యాదగిరిగుట్ట మండల వ్యాప్తంగా జరిగిన నామినేషన్ల ప్రక్రియ అనంతరం జరిగిన స్క్రూటిలో ఒక నామినేషన్ ను తిరస్కరించినట్లు ఎంపీడీవో నవీన్ కుమార్ తెలిపారు. యాదగిరి గుట్ట మండల పరిధిలోని చిన్నగౌరాయపల్లి గ్రామంలో మహిళా రిజర్వేషన్ వార్డుకు నామినేషన్ వేసినట్లు, ఆ నామినేషన్ ను తిరస్కరించినట్లు తెలిపారు. యాదగిరిగుట్ట మండలంలోని మొత్తం 23 గ్రామాల్లో సర్పంచ్ లకు162, వార్డులకు 575 నామినేషన్లు రాగా ఒక నామినేషన్ ను తిరస్కరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట మండల పరిధిలోని దాతారుపల్లి క్లస్టర్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు.

# సొంతగూటికి మాజీ ఎంపీటీసీ

జయభేరి, చిట్యాల :



చిట్యాల మండలం, జూకల్ గ్రామ మాజీ ఎంపీటీసీ జంబుల తిరుపతి, వారి తనయుడు శ్రీకాంత్ నిన్న కాంగ్రెస్ పార్టీలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి సమక్షంలో తిరిగి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారి వెంట మండల పార్టీ ప్రెసిడెంట్ అల్లం రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్, ప్రధాన కార్యదర్శి మడికొండ రవీందర్, మాజీ సర్పంచ్ మహేందర్, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# యాదగిరిగుట్టలో పోలీసుల వాహనాల తనిఖీ

జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 30:

యాదగిరిగుట్ట మండల పరిధిలోని రాయగిరి రోడ్డులో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఆదివారం యాదాద్రి ఏసీపీ శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. గ్రామపంచాయతీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తనిఖీలు నిర్వహించినట్లు ఏసీపీ శ్రీనివాస్ నాయుడు తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో యాదగిరిగుట్ట పట్టణ సీఐ భాస్కర్,ఎస్సై రూప, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఆంజనేయ స్వామి అనుగ్రహం పొందాలి



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ పట్టణం లోని తులచ్చమ్మ కుంట లోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం లో హనుమాన్ గాయత్రి మహాయజ్ఞం,అభిషేకం మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని అయన తెలిపారు.ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని అయన అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్, బిఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెల్లుగూరి వల్లపు రెడ్డ, పులిరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తుర్కపల్లి మండలంలో 901 నామినేషన్ల దాఖలు

జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 30:

తుర్కపల్లి మండలంలో రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా 27, 28, 29 తేదీల్లో మూడు రోజులు పాటు 91 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల మండల అధికారి, అడిషనల్ డిఆర్డిఓ గుర్రం సురేష్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 33 గ్రామపంచాయతీ సర్పంచులకు గాను 227 నామినేషన్లు, 266 వార్డు మెంబర్లకు గాను 674 నామినేషన్లు వచ్చినట్లు తెలిపారు. ఆదివారం రోజున అన్ని గ్రామాల్లో నామినేషన్ల పరిశీలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# 1 సర్పంచ్, 9 వార్డు సభ్యుల నామినేషన్లు తిరస్కరణ

జయభేరి, తుర్కపల్లి, నవంబర్ 30:

తుర్కపల్లి మండలంలో 1 సర్పంచ్, 9 వార్డు సభ్యుల నామినేషన్లను తిరస్కరించినట్లు మండల ఎన్నికల అధికారి, అడిషనల్ డిఆర్డిఓ గుర్రం సురేష్ తెలిపారు.. ఈ సందర్భంగా ఆయన వివరాలు తెలుపుతూ వేల్పు పల్లి గ్రామ సర్పంచ్ నామినేషన్ను, గంధ మల్ల నాలుగో వార్డులో రెండు నామినేషన్లు, పల్లెపహాడ్ ఐదో వార్డులో ఒక్క నామినేషన్, తిరుమలాపురం ఒకటో వార్డులో ఒక్క నామినేషన్, గోపాల్పూర్ ఐదో వార్డ్ లో ఒక్క నామినేషన్, చొక్లా తండా ఆరో వార్డులో ఒక నామినేషన్, పెద్దతండ 5వ వార్డులో ఒక నామినేషన్, ధర్మారం మూడో వార్డులో ఒక నామినేషన్, చిన్న లక్ష్మాపూర్ మూడో వార్డులో ఒక నామినేషన్ తిరస్కరించినట్లు తెలిపారు.



# యాదగిరిగుట్టలో నూతన అన్న ప్రసాద భవనం ప్రారంభం

- అనంత కోటి రాజు వేగేశ్న ఫౌండేషన్ ధాత సహకారంతో నూతన భవనం
- నిత్యం 2000 మంది భక్తులకు అన్న ప్రసాదం
- తిరుమల తిరుపతి తరహాలో అన్న ప్రసాద భవనం


జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 30:

తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం సన్నిధిలో కొండకింద విశాలమైన నూతన అన్నప్రసాద భవనాన్ని ఆదివారం యాదగిరిగుట్ట ఆలయ ఈవో వెంకట్రావు, అన్నదాన భవన దాత అనంత కోటి రాజ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్నదాన నూతన భవనం అందుబాటులోకి రావడంతో సంతోషంగా ఉందని, ప్రతినిత్యం సుమారు 2000 మంది భక్తులకు అన్నప్రసాదాన్ని నిరాటంకంగా పంపిణీ చేయనున్నామని అన్నారు. ఈ భవనాన్ని అన్ని హంగులతో సకల సౌకర్యాలతో నిర్మించామని తెలిపారు. ఈ భవనం అందుబాటులోకి రావడంతో యాదగిరిగుట్టకు వచ్చే భక్తులందరికీ స్వామివారి అన్నప్రసాదాన్ని అందించే దిశగా యాదాద్రి దేవస్థానం ముందుకు వెళుతుందని అన్నారు. ఇందుకు సహకరించిన దాత అనంత కోటి రాజును ఆలయ ఈవో వెంకట్రావు అభినందించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఇలాంటి దాతలు మరింత మంది ముందుకు వచ్చి యాదగిరిగుట్ట దేవస్థానం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు.

ఈ సందర్భంగా దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త నరసింహమూర్తి మాట్లాడుతూ సుమారు 21 కోట్లతో అన్నదాన భవన సత్రమును మహాద్భుతంగా నిర్మాణం చేపట్టడం జరిగిందని, గత ఐదు సంవత్సరాల నుండి వేగేశ్న ఫౌండేషన్ అనంత కోటి రాజు యొక్క ఆధ్వర్యంలో భవన నిర్మాణం చేపట్టడం జరిగిందని అన్నారు. యాదాద్రిలోనే కాకుండా తిరుపతిలో వెంగమాంబ సత్రము,ద్వారకా తిరుమల అన్నదాన సత్రము,వరంగల్ భద్రకాళి దేవాలయంలో జలప్రసాదము,అనేక దేవాలయాలలో భక్తుల సౌకర్యార్థం అన్నదాన సత్రాలు జల ప్రసాదము నిర్మిస్తారని అన్నారు. అనంతరం ఆలయ ఈవో వెంకట్రావు,అన్నదానం భవనం దాత అనంత కోటి రాజు, చైర్మన్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో నూతన భవనంలో ప్రత్యేక పూజలు, సత్యనారాయణ స్వామి వ్రతము నిర్వహించి అన్నప్రసాద భవనాన్ని ప్రారంభించారు. అనంతరం భక్తులకు పెద్దఎత్తున స్వామివారి అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. దేవస్థానం అధికారులు సిబ్బంది, జర్నలిస్టులు అన్నదానం ప్రసాదం స్వీకరించారు. అనంతరం దాతను ఆలయ అధికారులు పూలమాలలు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



# భక్తులతో కిటకిటలాడుతున్నా ఆలయ ప్రాంగణం




జయభేరి, యాదగిరిగుట్ట, నవంబర్ 30:

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం సెలవు రోజు కావడంతో స్వామివారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్యకల్యాణం, నిత్యబ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణపుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భక్తుల రద్దీ దృష్ట్యా క్యూలైన్లు, ప్రసాద విక్రయ కేంద్రం, ఆలయ పరిసరాలను ఈవో వెంకట్రావు తనిఖీ చేశారు.

శ్రీ నారసింహుడి నిత్యరాబడి..

శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా ఆదివారం రూ.48,99,878 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.2,81,700, బ్రేక్ దర్శనం ద్వారా రూ.4,20,900, వీఐపీ దర్శనం ద్వారా రూ.8,70,000, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.5,98,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.1,15,200, ప్రసాద విక్రయం ద్వారా రూ.17,23,370, కల్యాణకట్ట ద్వారా రూ.1,10,000తో పాటు వివిధ శాఖ, పాతగుట్ట ఆలయం ద్వారా ఆలయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.






# ప్రభాస్ అభిమానుల్లో ఆందోళన!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టుల్లో నటిస్తూ తన మార్కెట్‌ను మరింత పెంచుకుంటున్నారు. అదే సమయంలో ప్రేక్షకులు అతని ప్రతి సినిమా కోసం అపారమైన ఆసక్తితో ఎదురు చూస్తారు. ప్రభాస్ క్రేజీ ప్రాజెక్ట్‌లో ఒకటైన ‘ది రాజా సాబ్’ త్వరలో విడుదల కావాల్సి ఉంది. రొమాంటిక్, హారర్, కామెడీ కలిసిన యూనిక్ జానర్‌లో దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న ఈ చిత్రం మొదటి నుంచే సినీ వర్గాల్లో ప్రత్యేక చర్చనీయాంశమైంది. ముఖ్యంగా ప్రభాస్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించబోతున్నారని సమాచారం రావడంతో ఈ సినిమా పైన హైప్ ఇంకా పెరిగింది. మొదట ఈ సినిమా డిసెంబర్ 5, 2025న రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. కానీ తర్వాత విడుదల తేదీని సంక్రాంతి 2026 జనవరి 9కు మార్చారు. అయితే ఈ తేదీ కూడా ఖరారు కాలేదని ఇటీవల సోషల్ మీడియాలో ప్రచారమవుతోంది. ఈ అనుమానాల నడుమ మేకర్స్ ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేసి “సంక్రాంతికే వస్తున్నాం” అని క్లారిటీ ఇచ్చారు. అయినప్పటికీ ఇండస్ట్రీలో మాత్రం సరికొత్త మాటలు వినిపిస్తున్నాయి. ఇండస్ట్రీలో వినిపించే టాక్ ప్రకారం థియేట్రికల్, ఓటీటీ, సాటిలైట్ రైట్స్ వంటి కీలక డీల్స్ ఇంకా ఫైనల్ కాలేదట. ప్రభాస్ సినిమాలపై సాధారణంగా భారీ క్రేజ్ ఉండే నేపథ్యంలో ఇది కొంచెం ఆశ్చర్యకరంగా ఉంది.

డిస్ట్రిబ్యూటర్లు రిస్క్ తీసుకోవడానికి మొహమాటపడుతున్నారని, సినిమా బజ్ ఆశించిన స్థాయిలో లేదని,కావలసిన రేంజ్‌లో ఆఫర్లు రాలేదని సమాచారం ప్రభాస్ నటించే ‘స్పిరిట్’ సినిమాకు ఇప్పటికే ₹160 కోట్ల భారీ ఓటీటీ డీల్ కుదిరినట్లు వార్తలు వచ్చాయి. అయితే ‘రాజా సాబ్’ విషయంలో ఇంకా ఓటీటీ ఒప్పందం జరగకపోవడం చర్చనీయాంశమైంది. ఈ సినిమాకు విపరీతంగా VFX ఉండటం వల్ల పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఆలస్యమవుతున్నాయట. గ్రాఫిక్స్ వర్క్ పూర్తికాకపోవడం కూడా విడుదల తేదీపై ప్రభావం చూపుతోంది. ఇటీవల విడుదలైన ఫస్ట్ సింగిల్ మంచి స్పందన తెచ్చుకున్నప్పటికీ, సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేయలేకపోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనితో సినిమా నిజంగా సంక్రాంతికే వస్తుందా? లేక వాయిదా పడుతుందా? అనే సందేహాలు అభిమానుల్లో కనిపిస్తున్నాయి.

# రూరల్ మాస్ జనార్దన్



‘రౌడీ జనార్దన్’ సినిమా కోసం విజయ్ దేవరకొండ అభిమానులంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. దిల్ రాజు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవికిరణ్ కోలా దర్శకుడు. సీనియర్ హీరో డా.రాజశేఖర్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే కొంతభాగం పూర్తయింది. దర్శకుడు రవి కిరణ్ క్లైమాక్స్ షూట్ కోసం సన్నాహాలు చేస్తున్నారు. ఈ వారంలోనే షూట్ మొదలయ్యే అవకాశం ఉంది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ మాస్ ఎంటర్‌టైనర్‌లో విజయ్ దేవరకొండ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని, యూత్ ఆయన్ను ఎలా చూడాలనుకుంటున్నారో ఇందులో ఆయన అలా కనిపిస్తారని మేకర్స్ చెబుతున్నారు. డా.రాజశేఖర్ పాత్ర కూడా ఇందులో కొత్తగా ఉంటుందట. ఇప్పటికే ఆయన లుక్ టెస్ట్‌ని కూడా పూర్తి చేశారట. కీర్తి సురేశ్ ఇందులో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే.

# రెండుసార్లు విడాకులు తీసుకున్న వ్యక్తితో పెళ్లి..



ఒకప్పుడు అత్యధిక పారితోషికం పొందే నటీమణులలో ఒకరు. ఆమె టీవీ సీరియల్స్, సినిమాలు, బ్యాండ్ ఎండార్స్‌మెంట్‌లు, ప్రకటనలు, ప్రమోషనల్ కార్యకలాపాల ద్వారా మంచి మొత్తాన్ని సంపాదిస్తుంది. ఏక్తా కపూర్ సీరియల్ ‘కెప్టెన్ హౌస్’ ద్వారా నటి తన కెరీర్‌ను ప్రారంభించింది. తరువాత, ఆమె 1999లో ‘డాగ్: ది ఫైర్’ చిత్రం ద్వారా బాలీవుడ్‌లోకి అడుగు పెట్టింది. తెలుగులో సొంతం సినిమాలో సెకండ్ హీరోయిన్ గా నటించింది. 2020లో పారిశ్రామికవేత్త శార్దూల్ సింగ్‌ను వివాహం చేసుకుంది. శార్దూల్‌ను వివాహం చేసుకున్న తర్వాత, ఆమె చాలా ట్రోలింగ్‌ను ఎదుర్కొంది. అప్పటికే శార్దూల్ రెండుసార్లు విడాకులు తీసుకున్నారు. అంతేకాదు అతడికి ఇద్దరు కుమార్తెలు కూడా ఉన్నారు. అతడు 22 కంపెనీలకు యజమాని.. దాదాపు రూ. 10,558 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నాయి. ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటున్న నేహా.. సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటుంది.

# ఆమె కూతురు కూడా టాలీవుడ్‌లో క్రేజీ



పేరుకు మలయాళ నటినే అయినా తెలుగులోనూ ఎక్కువగా సినిమాలు చేసింది వాణీ విశ్వనాత్. తెలుగులో దాదాపు స్టార్ హీరోలందరితోనూ సినిమాలు చేసిందీ అందాల తార. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవితో ఆమె నటించిన సినిమాలు సూపర్ హిట్ అయ్యాయి. కాగా పెళ్లి, పిల్లల కారణంఆ మధ్యలో కొంచెం గ్యాప్ తీసుకుంది వాణీ విశ్వనాత్. ఇప్పుడు మళ్లీ సినిమాల్లో బిజీ అవువుతోందీ అందాల తార. జయ జానకి నాయక సినిమాతో సెకెండ్ ఇన్నింగ్స్ ప్రారంభించింది వాణీ విశ్వనాథ్. రాజ్ తరుణ్ ఓరేజ్ బుజ్జిగా సినిమా లోనూ ఓ కీలక పాత్ర పోషించింది. సినిమాల సంగతి పక్కన పెడితే వాణి విశ్వనాథ్ ఫ్యామిలీ గురించి చాలా మందికి తెలియదు. వాణి విశ్వనాథ్.. మలయాళ ప్రముఖ నటుడు, దర్శకుడు బాలు రాజ్‌ని పెళ్లి చేసుకుంది. వీరిది ప్రేమ వివాహం. 2002లో వీరి పెళ్లి జరగ్గా నలుగురు పిల్లలున్నారు. వాణీ విశ్వనాథ్ కూతుర్లలో ఒకరు ఇప్పుడు తెలుగు సినిమాల్లో హీరోయిన్ గా రాణిస్తోంది. ఇప్పటికే ఆమె ఓవరాల్ గా మూడు సినిమాల్లో నటించింది. .ఇంతకీ ఆమె ఎవరనుకుంటున్నారా? వర్షా విశ్వనాథ్. వాణీ విశ్వనాథ్ చెల్లెలు ప్రియా విశ్వనాథ్ కుమార్తెనే ఈ అందాల తార. 2022లో ‘రెడ్డిగారింట్లో రౌడీయిజం’ అనే సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది వర్షా విశ్వనాథ్. అయితే ఈ మూవీ పెద్దగా ఆడలేదు. దీని తర్వాత మలయాళంలో పాథోన్పథం నూట్టండు అనే ఓ సినిమాలోనూ నటించింది. ఈ మూవీ సూపర్ హిట్ గా నిలిచింది. ఇటీవల విజయ్ సేతుపతి కుమారుడు సూర్య సేతుపతి నటించిన ఫీనిక్స్ సినిమా లోనూ మెరిసిందీ అందాల తార.

# ‘మన శంకర వరప్రసాద్ గారు’ ఏకంగా 500 మంది డ్యాన్సర్స్‌తో..



మెగాస్టార్ చిరంజీవి నటించిన మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ‘మన శంకర వరప్రసాద్ గారు’ ఈ సంక్రాంతికి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ భారీ చిత్రంపై అంచనాలు నెలకొన్నాయి. చిరు ఎనర్జీ, నయనతార స్క్రీన్ ప్రెజెన్స్, అనిల్ స్టైల్ వినోదం కలిసి ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనేలా చేశాయి. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ చిత్రానికి అర్చన సమర్పకురాలిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల విడుదలైన పోస్టర్లు, చార్ట్‌బస్టర్ సాంగ్ ‘మీసాల పిల్ల’ సినిమా చుట్టూ హైప్ మరింత పెంచాయి.

ఈ చిత్రంలో విక్టరీ వెంకటేష్ చేస్తున్న కీలక పాత్ర స్పెషల్ అట్రాక్షన్‌గా మారనుంది. ఇది కేవలం అతిథి పాత్ర కాకుండా కథలో ప్రధానమైన క్యారెక్టర్‌గా రూపొందించబడింది. చిరు-వెంకీ కలయికకు అభిమానులు ఏళ్లుగా ఎదురుచూస్తుండగా, చివరకు ఈ కాంబినేషన్ కుదరడంతో క్రేజ్ మరింత పెరిగింది. ఇద్దరు స్టార్ హీరోలు కలిసి స్క్రీన్‌పై స్టైలిష్ మాస్ స్టెప్పులు వేయనున్నారని తెలిసి ఫ్యాన్స్ ఉత్సాహం రెట్టింపైంది.

తాజాగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన రంగురంగుల భారీ కార్నివాల్ సెట్‌లో చిరంజీవి - వెంకటేష్‌లపై ఓ ఎనర్జిటిక్ డ్యాన్స్ సాంగ్ చిత్రీకరణ ప్రారంభమైంది. ఈ ప్రత్యేక సెట్‌లో 500 మందికి పైగా డ్యాన్సర్లు పాల్గొంటుండటం విశేషం. పండుగ వాతావరణాన్ని తలపించేలా కలర్‌ఫుల్ థీమ్, గ్రాండ్ కాస్ట్యూమ్స్, వైబ్రంట్ అట్మాస్ఫియర్‌తో మేకర్స్ ఈ సాంగ్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు.

‘మీసాల పిల్ల’ సాంగ్‌కు భారీ రెస్పాన్స్ రావడంతో దాని కొరియోగ్రాఫర్ పోలంకి విజయ్ కొత్త డ్యాన్స్ నంబర్‌కు కూడా డ్యాన్స్ మాస్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇక భీమ్స్ సిసిరోలియో అందించిన బాణీలు ఇప్పటికే సంగీత ప్రేమికులను ఆకట్టుకుంటున్నాయి. చిరు-నయనతారలపై కేరళలో చిత్రీకరించిన మెలోడీ సాంగ్‌ను త్వరలో రిలీజ్ చేయనున్నట్లు సమాచారం.

ప్రస్తుతం ‘మన శంకర వరప్రసాద్ గారు’ షూటింగ్ ఫైనల్ స్టేజ్‌లో ఉంది. వినోదం, భావోద్వేగం, మాస్ ఎంటర్‌టైన్‌మెంట్ మేళవింపుతో సినిమా రూపొందుతుందంటూ దర్శకుడు అనిల్ రావిపూడి వెల్లడించారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**